క్లుప్తంగా

ఘనంగా మహారుద్రాభిషేకం



నల్లబెల్లి : మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ఏకాదశ మహారుద్రాభిషేకం, సహస్ర మారేడు దళాభిషేకం, తదితర కార్యక్రమాలను హంపి పీఠాధిపతి శ్రీశ్రీ విద్యారణ్యస్వామి శిష్యులు, సిద్దిపేట సిద్ధాంతి కలకుంట రాజేశ్వర్‌రెడ్డి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 లీటర్ల ఆవుపాలతో రుద్రాభిషేకం, పసుపు, కుంకుమ, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాటిపెల్లి రవీందర్‌రావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గందె శ్రీనివాస్ గుప్తా, ట్రస్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పురాం బద్రీనాథ్, కోశాధికారి మార్త మార్కండేయ్య, గంగిశెట్టి శ్రీనివాస్, నానబోయిన రాజారాం, సట్ల శ్రీనివాస్, గుగ్గిళ్ల శ్రీనివాస్, పురాం సతీష్, డాక్టర్ ఉదయ్ సింగ్, గందె శ్రీలత, నానబోయిన కోమల, అర్చకులు శ్రీనివాస్, పెందోట మురళీ మోహనా చారి, తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరుడికి పూజలు



నర్సంపేట : పట్టణంలో శ్రీకంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు మంగళవారం నాల్గో రోజు కొనసాగగా గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బమ్మెర కుమారస్వామి, ప్రచార కార్యదర్శి మండ శ్యామ్, సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రకృతి ప్రేమికులుగా సహజ వాతావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఐటీ సెల్ రాష్ట్ర బాధ్యులు నాగపురి కాంతికిరణ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ గోపాల్, నాయకులు కొల్లూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ



వర్ధన్నపేట : పట్టణంలోని కోనారెడ్డి చెరువు మత్తడి వద్ద ఉన్న దుర్గమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు అమ్మవారి విగ్రహానికి ఉన్న పుస్తెలతాడు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకులు మంగళవారం ఉదయం చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేపట్టారు. ఆలయంలో గతంలోనూ పలుమార్లు చోరీ జరిగింది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సంగెం : ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున ఏఎస్సై లక్ష్మి, కానిస్టేబుళ్లు శ్రవణ్, అమీర్‌బాబాతో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని కాపుల కనపర్తి వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి విచారణ చేశారు. సదరు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఇసుకను సంగెం, వరంగల్ పరిసర ప్రాంతాలకు అక్రమంగా తరలించి విక్రయిస్తున్న వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాలకు చెందిన బైరి రాజు, జంపాల శ్రీకాంత్, తీగరాజ్ కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నివాళి



నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని జీడిగడ్డతండాకు చెందిన భూక్య వస్రామ్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, మాజీ ఎంపీపీ జక్క అశోక్, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మాజీ ఎంపీటీసీలు చెరుకుపెల్లి విజేందర్‌రెడ్డి, గుగులోతు చక్రు, మాజీ సర్పంచ్ బానోత్ లాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నారంలో..

పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దర్గా పూజారి పాషా నానమ్మ జైనా బీ మంగళవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి స్థానిక సొసైటీ చైర్మన్ ఎం.మనోజ్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యుడు షబ్బీర్ అలీ, నాయకులు బుర్ర యాకయ్య, రాపోలు యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సగం సమస్యాత్మకం

- మొత్తం 52 పోలింగ్ కేంద్రాలు
- 6 గ్రామాల్లోనే మొత్తం 25..



గీసుకొండ : మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో దాదాపు సగం సమస్యాత్మకమైనవిగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలో మొత్తం 52 పోలింగ్ కేంద్రాలుండగా వాటిలో 25 సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. ఆ ఆరు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు కూడా ఆరు గ్రామాల పరిధిలోనివే కావడం గమనార్హం.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన క్రమంలో సంబంధిత శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో మొత్తం 28,908 మంది ఓటర్లున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 13,979 మంది పురుషులు కాగా 14,928 మంది స్త్రీలు. ప్రధానంగా ప్రభుత్వ, జెడ్పీ హైస్కూళ్లలో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కాగా పోలింగ్ సందర్భంగా గొడవలు జరిగే అవకాశాలున్న కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. మండలంలో మొత్తం 52 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా అందులో 25 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. ప్రధానంగా వంచనగిరిలో 5, శాయంపేటలో 3, గీసుకొండలో 5, ఎలుకుర్తిలో 6, కొమ్మాలలో 3, మచ్చాపూర్‌లో 3 పోలింగ్ కేంద్రాలను గొడవలు జరిగే అవకాశం ఉన్నవిగా నిర్ధారించారు. సదరు పోలింగ్ కేంద్రాల పరిధిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

మండలంలోని ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల వివరాలిలా..

మండల పరిధిలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎలుకుర్తి (ఎస్సీ మహిళ) ఎంపీటీసీ స్థానంలో ఆరెపల్లిలో 709, ఎలుకుర్తిలో 3,564 మంది ఓటర్లుండగా గీసుకొండ (బీసీ జనరల్) స్థానంలో బొడ్డుచింతలపెల్లిలో 1160, గీసుకొండలో 2,865 మంది, కొమ్మాల (ఎస్టీ జనరల్) స్థానం పరిధిలో అనంతారంలో 710, కొమ్మాలలో 1795, సూర్యతండాలో 499 మంది, మచ్చాపూర్ (జనరల్) స్థానంలో గంగదేవిపల్లిలో 1118, హర్జ్యతండాలో 374, మచ్చాపూర్‌లో 2102 మంది, మనుగొండ (ఎస్సీ జనరల్) స్థానంలో చంద్రయ్యపల్లిలో 513, మనుగొండలో 1883, రాంపూర్‌లో 382 మంది, ఊకల్ (బీసీ మహిళ) స్థానంలో కొనాయమాకులలో 916, మరియపురంలో 753, ఊకల్‌లో 1492 మంది, శాయంపేట (బీసీ మహిళ) స్థానంలో 1940 మంది, వంచనగిరి (బీసీ జనరల్) స్థానంలో 3015, విశ్వనాథపురం (జనరల్) స్థానం దస్రు దదదదదదదదదదదదదతండాలో 779, నందనాయక్‌తండాలో 1026, విశ్వనాథపురంలో 1313 మంది ఓటర్లున్నట్లు అధికారులు ప్రకటించారు.

దేశ సమగ్రతే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

- విభాగ్ జాయింట్ సెక్రటరీ ఇస్తారి

నెక్కొండ : దేశ సమైక్యతే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) లక్ష్యమని వరంగల్ విభాగ్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి తెలిపారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో సంఘ్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడారు. హిందూ ధర్మంపై దాడులు జరుగుతున్న సమయాల్లో కర సేవకులు పరిరక్షణకు నడుం బిగించారని తెలిపారు. హిందువుల ఐక్యతే దేశానికి రక్షణ అని చెప్పారు. దేశాభివృద్ధికి, హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం సురేందర్, చెంగల రాజు, విష్ణు, పరుపాటి ఇంద్రసేనారెడ్డి, రాము, నాయిని అశోక్, కొమురవెల్లి సతీష్, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఇస్తారి, కర సేవకులు

బీఆర్‌ఎస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న పెద్ది

దుగ్గొండి : మండలంలోని రాజ్యతండా, గోబ్రియా తండా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బానోతు భద్రు, అజ్మీర వెంకన్న, అజ్మీర జంబు, బానోతు పీరయ్య ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్‌లో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా వారికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. బాకీ కార్డుతో కాంగ్రెస్ ప్రభుత్వ భరతం పడతామని చెప్పారు. కాంగ్రెస్ ఎగ్గొటిన పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని శ్రేణులను కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, నాయకులు కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, పిండి కుమారస్వామి, బానోతు రవీందర్ నాయక్, ఉమేశ్‌రెడ్డి, హనుమ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



గీసుకొండ : మండలంలోని గొర్రెకుంట క్రాస్ రోడ్డు వద్ద వరంగల్–నర్సంపేట రహదారితోపాటు గొర్రెకుంట, కీర్తినగర్‌కు వెళ్లే దారుల్లో వాహనాలను సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ముమ్మరంగా తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాల్లేని వాహనదారులకు జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న పలువురిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సైలు అనిల్‌కుమార్, రోహిత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి



నర్సంపేట : బాకీ కార్డులను పంపిణీ చేస్తున్న దేవోజు తిరుమల సదానందం, నాయకులు

నర్సంపేట/ఖానాపురం/పర్వతగిరి/రాయపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను కోరారు. నర్సంపేట, ఖానాపురం, పర్వతగిరి, రాయపర్తి మండలాల్లో కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సంపేటలో మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం, ఖానాపురంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, పర్వతగిరిలో ఎంపీటీసీ ఎన్నికల ఇన్‌చార్జ్ మాడుగుల రాజు, రాయపర్తిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిన హామీలను బాకీ పేరుతో ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. అధికారమే లక్ష్యంగా అనేక మోసపూరిత హామీలు గుప్పించారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ప్రజలను కోరారు.

గుడుంబా తయారీదారుల బైండోవర్



పర్వతగిరి : గుడుంబా తయారీదారులను బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ ఎస్సై సరిత

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండకు చెందిన నరిగె లక్ష్మి, ఏనుగల్లుకు చెందిన మాసాని కొమురమ్మ, మాసాని దుర్గయ్య, పర్వతగిరికి చెందిన నీరటి రాణిలను గుడుంబా విక్రయిస్తున్న కేసులో తహసీల్దార్ వెంకటస్వామి ఎదుట ఎక్సైజ్ ఎస్సై సరిత మంగళవారం బైండోవర్ చేశారు. అనంతరం సరిత మాట్లాడారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా బెల్ట్ షాపుల నిర్వాహకులపైనా కేసులు నమోదు చేస్తామన్నారు.

వృద్ధుల బైండోవర్‌పై ఆందోళన

మండలంలోని 33 గ్రామాలు, శివారు తండాల్లో విచ్చలవిడిగా గుడుంబా తయారీ, విక్రయాలు కొనసాగుతుండగా బైండోవర్లపై వృద్ధులు ఆందోళనకు గురవుతున్నారు. కొత్తగా పలువురు గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతుండగా వారిపై చర్యలు తీసుకోకుండా బెల్ట్‌షాపుల నిర్వాహకులపై ఎన్నికల కోడ్‌లో భాగంగా కేసులు నమోదు, బైండోవర్ చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చెన్నారావుపేట మండలంలో..

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారులోని హర్యానాయక్‌తండాకు చెందిన తేజావత్ నర్సింహ ఇంటిపై పోలీసులు మంగళవారం దాడి చేసి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 150 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా మీడియాకు ఎస్సై రాజేశ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నర్సింహపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సన్మానం



దుగ్గొండి : మండలంలోని చాపలబండకు చెందిన బోనగిరి కల్యాణి కమలాకర్ దంపతుల కుమార్తె పల్లవి ఎంబీబీఎస్‌లో ప్రవేశం సాధించగా ఆమెను ముదిరాజ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (మెపా) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ మంగళవారం సన్మానించారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. తద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు పెండ్యాల కృష్ణ, జటబోయిన రాజేందర్, సంకెల్ల స్వామి, రాజు, బోనగిరి గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం అందించాలి

- బీఆర్‌ఎస్ పరిశీలకుడు సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని బీఆర్‌ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల విభాగం మండల పరిశీలకుడు నామాల సత్యనారాయణ, కన్వీనర్ కోమాండ్ల గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేట మండలంలోని చిన్న గురిజాలలో దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలను మంగళవారం వారు పరిశీలించి మాట్లాడారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా భారీ వర్షాలు మరింతగా నష్టం కలిగించాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో సర్వే చేయించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొడారి రవి, మోటూరి రవి, బండారి రమేశ్, భూక్య వీరన్న, చిన్నపెల్లి నర్సింగం, కొమురయ్య, గడ్డం రాజు, అల్లి రవి, పుప్పాల భీమయ్య, మంచిక హరీశ్, పోతు శంకర్, సంగెం శ్రీకాంత్, బొల్లం బక్కయ్య, కంకణాల రాజు, తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

గంగదేవిపల్లిలో ఏపీ వాసుల అధ్యయనం



గంగదేవిపల్లిని సందర్శించిన వారితో కూసం రాజమౌళి తదితరులు

గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లాకు చెందిన రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో 45 మంది మంగళవారం సందర్శించి అధ్యయనం చేశారు. బత్తులపల్లి, ధర్మవరం, మామిళ్లపల్లె, ముదిగుబ్బ, కొత్తచెర్వు మండలాలకు చెందిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ లీడర్లు గ్రామ అభివృద్ధి తీరుతెన్నులపై అడిగి తెలుసుకున్నారు. వారికి ట్రస్ట్ ప్రతినిధి కొట్టె రమాదేవితోపాటు జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి గ్రామం గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ధనలక్ష్మి, హనుమంతప్ప, సంజీవరెడ్డి, పద్మావతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం’

పర్వతగిరి : వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా మండలంలోని రావూరుకు కేటాయించబడిన టీచర్ (ఎస్‌జీటీ) సీహెచ్.రాజు ముంజాలకుంటతండాలో పని చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయమై సదరు ఉపాధ్యాయుడిని వివరణ కోరగా రావూరు స్కూల్‌లో 1వ తరగతిలో విద్యార్థి హాజరవుతున్న క్రమంలో యూడైస్‌లో పేరు నమోదు అయినట్లు తెలిపారు. ఆ నేపథ్యంలో తాను రావూరు స్కూల్‌లో పని చేస్తున్నట్లు తెలిపారు.

మతోన్మాద చర్యలను తిప్పికొట్టండి

- సీపీఐ కౌన్సిల్ సభ్యుడు కుమారస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నల్లబెల్లి : మతోన్మాద చర్యలను ఐక్యంగా తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన న్యాయవాది దాడి చేయడాన్ని ఖండించారు. ఖజురహోలోని ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహ ప్రతిష్టాపనకు సంబంధించిన పిటిషన్‌ను గవాయ్ తిరస్కరించడంతో హిందు శక్తులు కుట్ర చేశాయని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, న్యాయ వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నంగా దాడిని అభివర్ణించారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా బహుజనులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో నాయకులు కడియాల క్రాంతి, కోల లింగయ్య, ఇస్లావత్ నెహ్రూ, గంగారపు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన కోతి ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి స్థానికుడైన స్టేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ మంగళవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత ఎల్లమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. లక్ష్మీనారాయణ పంపిన నగదును బాధిత కుటుంబానికి గ్రామ పెద్దలు రామ్మూర్తి, పసుల రాజేందర్, సంపత్, నవీన్, కిశోర్ అందజేశారు.

బీఏఎస్ నిధులు విడుదల చేయాలి

- ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్



నిరసన తెలుపుతున్న నరేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు

నర్సంపేట : బెస్ట్ అవైలబుల్ స్కూల్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్కూల్ ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. నర్సంపేట, నెక్కొండ, నల్లబెల్లి, తదితర మండలాలకు చెందిన పలువురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించి నాలుగేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాలల యాజమాన్యాలు నోటీసులు అందించాయని తెలిపారు. నిధుల విడుదలలో నిర్లక్ష్యం వల్ల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలన్నారు.

వాల్మీకి జయంతి



నల్లబెల్లి : మండల కేంద్రంలో బోయ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి సంఘం అధ్యక్షుడు పత్తి రవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవి మాట్లాడారు. వాల్మీకి బోధనలు వివరించారు. వాల్మీకిని యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ముష్కె భరత్, కార్యదర్శి కందుగుల సందీప్, నాయకులు పత్తి కిషన్, పత్తి రంజిత్, పత్తి సమ్మయ్య, కందుగుల సతీశ్, ముష్కె మనీశ్, చెప్పుల రాంచందర్, రాజేశ్, విజయ్, సాయికుమార్, కరుణాకర్, రాజయ్య, నాగరాజు, సదయ్య, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన



వర్ధన్నపేట : ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన ఘటనలో పరిహారం ఇస్తామని ఒప్పుకుని ఇవ్వడం లేదంటూ బాధిత కుటుంబం మంగళవారం నిరసన తెలిపింది. వివరాలిలా.. ఏప్రిల్‌లో మండలంలోని కట్ర్యాలకు చెందిన ట్రాక్టర్ యజమాని కరీమ్ వద్ద ఇటికల రవి డ్రైవర్‌గా పని చేస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చేందుకు గ్రామ పెద్దల సమక్షంలో కరీమ్ అంగీకరించాడు. ఐదు నెలలు గడచినా పరిహారం ఇవ్వకపోవడంతో బాధిత కుటుంబం కరీమ్ ఇంటి ఎదుట నిరసనకు దిగింది. పోలీసులు చేరుకుని బాధితులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చి నిరసన విరమింపజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పర్వతగిరి : మండలంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులు అనూష, తేజస్వి, నాగలక్ష్మి, పూజిత, శృతి, రుచిత, వెన్నెల, మౌనిక, రేణుశ్రీ జిల్లాస్థాయి అసోసియేషన్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ జ్యోత్స్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, అధ్యాపకులు కళాశాల ఆవరణలో మంగళవారం అభినందించారు. ఈనెల 10న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

నిందితుడిని అరెస్ట్ చేయాలి

నర్సంపేట : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేయాలని బీఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడిని ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు. దాడులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో బుర్రి సాగర్, రమేశ్, రవి, రజిత, శ్రీకాంత్, మరియ పాల్గొన్నారు.

10న జాబ్‌మేళా

వర్ధన్నపేట : ఈనెల 10న వర్ధన్నపేటలోని పుస్కోస్ స్కూల్ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తామని యువ పరివర్తన్ ఫౌండేషన్ ప్రతినిధులు బెల్లంకొండ వెంకట్, నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేళాకు 34 కంపెనీలు సాఫ్ట్‌వేర్, ఫైనాన్స్, మార్కెటింగ్, హెల్త్ కేర్, టెక్నీషియన్స్, తదితర ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన యువత బయోడేటాతోపాటు ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో మేళాకు హాజరుకావాలని కోరారు. సెల్ నంబర్ 8328655542, 9676843762లో సంప్రదించాలని తెలిపారు.